ప్రజాశక్తి

మంగళవారం 14 మార్చి 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

విశాఖలోని కృష్ణా కాలేజ్ వద్ద బారులుతీరిన ఓటర్లు

మునగపాకలో బారులుతీరిన ఓటర్లు

మండలి పోలింగ్ ప్రశాంతం

- ఓటు కోసం ఎక్కడికక్కడే క్యూలు
- చాంతాడంత బ్యాలెట్ పేపర్
- అనుభవం లేని సిబ్బంది
- మందకొడిగా ఓటింగ్ ప్రక్రియ
- సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్
- విశాఖలో 61.94, అనకాపల్లిలో 73.61 శాతం నమోదు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి (ఎమ్మెల్సీ) ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో చెదురుముదురు ఘటనలు మినహా సజావుగా ఎన్నికలు జరగడం ఊరటనిచ్చే విషయం. అయితే, ఓట్ల గల్లంతు, అనుభవం లేని సిబ్బంది పోలింగ్ స్టేషన్లలో ఉండడంతో గంటల తరబడి క్యూ లైన్లలో ఓటర్లు బారులుదీరారు. సాయంత్రం 4 గంటలకు పోలింగ్ నిర్ణీత సమయం ముగిసినా పలుచోట్ల క్యూలలో ఓటర్లు ఉండిపోయారు. బ్యాలెట్ పత్రం నాలుగైదు మడతలు పెడితేగానీ బ్యాలెట్ బాక్సులోకి వెళ్లని పరిస్థితిలో చాలా మందికి అవస్థలు తప్పలేదు. ప్రతి బ్యాలెట్ పత్రాన్నీ ఒక కర్ర చేత పట్టుకుని బాక్సులోకి పంపాల్సిన పరిస్థితి అన్ని స్టేషన్లలోనూ కనిపించింది.

ఓట్ల వివరాల్లోకి వెళితే...

శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతా రామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో 331 పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయి. పురుష ఓటర్లు 1,82,149 మంది, మహిళా ఓటర్లు 1,07,027 మంది, ట్రాన్స్‌జెండర్లు 38 సహా మొత్తంగా 2,89,214 మంది ఓటర్లు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కడపటి వార్తలు అందేసరికి విశాఖలో 61.94 శాతం, అనకాపల్లిలో 73.61 శాతం పోలింగ్ నమోదైంది.

క్రాస్ ఓట్ల దెబ్బపై పార్టీల్లో ఆందోళన

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ప్రధాన రాజకీయ పార్టీలు తెలుగుదేశం, వైసిపి, బిజెపి సహా 250 ప్రజా సంఘాలు బలపరిచిన ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థితోపాటు 37 మంది శాసన మండలి బరిలో ఉన్నారు. ఓట్లు వేసేవారంతా పట్టభద్రులు కాబట్టి అభ్యర్థిని సెలక్టు చేసుకునే ఓటింగ్ చేస్తారన్నది ఒక అంశమైతే ప్రాధాన్యతలు కూడా ఉండడంతో టిడిపికి వేసిన వారు పిడిఎఫ్‌కు వేసి ఉండొచ్చు. దీంతో రెండో ప్రాధాన్యత ఓటింగ్ పిడిఎఫ్‌కు వచ్చి ఉండొచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. వైసిపిలో పలువురు పిడిఎఫ్‌కు వేసి ఉండొచ్చు. బిజెపికి కూడా విశాఖ నగరంలో కొన్ని చోట్ల ఓటింగ్ పడింది. చాలా వరకూ వైసిపి వ్యతిరేక ఓట్లే ఈ పార్టీల మధ్య చీలింది. ఇది ఎవరికి నష్టపరుస్తుందో అన్న ఆందోళన ప్రధాన పార్టీల్లో నెలకొంది.

తీవ్ర జాప్యం

గత ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన మూడు సందర్భాల్లో సైతం ఈ సారి జరిగినట్టుగా పోలింగ్‌లో జాప్యం జరగలేదు. పోలింగ్ బూత్‌నకు వచ్చే ఓటరుకు ఓటు ఎలా వేయాలి అన్న అవగాహన కూడా లేని పరిస్థితి కనిపించింది. అభ్యర్థి పేరుకు ఎదురుగా ఏమి రాయాలి ? వేయాలి ? అంటూ ఎంవిపి.కాలనీ, ఆరిలోవ, గాజువాక, భీమిలి, సాగర్‌నగర్‌లోని కొన్ని బూత్‌లలో కొద్ది మంది ఓటర్లు స్థానిక పోలింగ్ సిబ్బందిని అడగడం విశేషం. అభ్యర్థులు 37 మంది బరిలో నిలవడం, బ్యాలెట్ పత్రం సైజు చాలా పెద్దగా ఉండటం చూసి కొద్ది మంది కంగారు పడ్డారు. పోలింగ్ బూత్‌లలోకి వచ్చిన సిబ్బందికి ఎమ్మెల్సీ ఎన్నికలు కొత్త కావడంతో బ్యాలెట్ పేపర్లు ఇవ్వడం, బాక్సుల్లో వేయడం వద్ద ఆలస్యం జరిగింది. దీంతో చెల్లని ఓట్ల సంఖ్య కూడా ఈ పోలింగ్‌లో అత్యధికంగా బయటపడే అవకాశాలున్నాయని తెలుస్తోంది. గతంలో టీచర్లు ఈ విధుల్లో ఉండేవారు. వారికి ఎన్నికలు ఎలా నిర్వహించాలో తెలుసు. కానీ రాష్ట్ర ప్రభుత్వం వారిని ఎన్నికల విధుల నుంచి తప్పించేసింది. అంతేగాకుండా పలు బూత్‌లలో టీచర్ల ఓట్లను కూడా ప్రభుత్వం తప్పించేసిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. 'మేం టీచర్లం కదా.. మా ఓటు అధికార పార్టీకి పడదని తెలిసి మా ఓట్లును ప్రభుత్వం తీసేసింది' అంటూ సాగర్‌నగర్‌లోని 289 బూత్ నుంచి ఇద్దరు టీచర్లు బయటకొచ్చి గగ్గోలు పెట్టారు.

ఓటేసిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ఎయులోని పోలింగ్ కేంద్రంలో ఓటేసిన యువతులు

అందరి చూపూ రెండో ప్రాధాన్యత వైపే

వార్త 2లో..

లా పెరోస్ విన్యాసాలు ప్రారంభం

వార్త 2లో..

వన్డే మ్యాచ్‌కు ఏర్పాట్లు పరిశీలన

వార్త 3లో..

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విరమించుకోండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భేషరతుగా విరమించుకోవాలని మురికివాడల నివాసుల సంక్షేమ సంఘం నాయకులు ఈసరపు లక్ష్మి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి 709వ రోజుకు చేరాయి. దీక్షలలో మురికివాడల నివాసుల సంక్షేమ సంఘం మహిళలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. నేటి వరకూ ఉపాధి లభించని నిర్వాసితులందరికీ శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. స్టీల్‌ప్లాంట్ మిగతా 2లో..

దీక్షల్లో కూర్చున్న మహిళలు

'నాటు నాటు' విజయోత్సవం - ఆస్కార్ అవార్డు రావడంతో విశాఖలో సంబరాలు

వార్త 2లో..

మొదటి వార్షికోత్సవ శుభాకాంక్షలు

అమృత క్లినిక్

మధుమేహవ్యాధి వైద్య నిపుణులు

- బిపి, షుగర్
- థైరాయిడ్ మరియు దీర్ఘకాలిక వ్యాదులు
- మలేరియా టైఫాయిడ్
- విష జ్వరములు
- గుండె, ఉపిరితిత్తులు
- కిడ్నీ, నరములు
- లివర్ డిసిజెస్

డా॥డి.విద్యాసాగర్‌రావు

Reg.No. 54787

MBBS, M.D. (General Medicine)

అన్ని రకముల వ్యాధులకు చికిత్స చేయబడును.

Timings : 9.00 am to 9.00 pm

D.No. 10-2-8, Beside State Bank of India, 4 Seasons Bakery, Old Gajuwaka Junction, Visakhapatnam-530026

63011 04143, 85005 90480

FREE CONSULTATION SUGAR TEST 10 AM TO 1PM ON EVERY SUNDAY

మొదటి పేజీ తరువాయి..

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విరమించుకోండి

మిగులు భూములను నిర్వాసితులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.జయమ్మ, ఎన్.లక్ష్మి, ఆర్.కళావతి, ఇ.రాము, టి.ఆదమ్మ, పి.పారమ్మ, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న గంటా శ్రీనివాసరావు తదితరులు

'నాటు నాటు' విజయోత్సవం

- ఆస్కార్ అవార్డు రావడంతో విశాఖలో సంబరాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ఆర్ఆర్ఆర్ చిత్రంలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు లభించిన సందర్భంగా సోమవారం సాయంత్రం డైమండ్ పార్క్ సమీపంలోని ఓ హోటల్‌లో వైజాగ్ ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు రాజకీయ నాయకులు, సినీ డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు హాజరయ్యారు. మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొని కేక్ కట్ చేశారు. సినీ ఎగ్జిబిటర్, పశ్చిమ ఎమ్మెల్యే పిజిఆర్.నాయుడు (గణబాబు), మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆర్ఆర్ఆర్ చిత్రంలోని నాటు నాటు ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో ఉత్తమ పాటగా ఆస్కార్ అవార్డు సొంతం చేసుకొని భారతీయ సినీ చరిత్రలో అపూర్వ ఘట్టానికి తెరతీసిందని కొనియాడారు. దేశం గర్వించదగ్గ ఇంతటి ఘన విజయాన్ని సాధించిన చిత్ర దర్శకుడు రాజమౌళి, స్వరకర్త కీరవాణి, గీత రచయిత చంద్రబోస్ అభినందనీయులని కొనియాడారు.

లా పెరోస్ విన్యాసాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బహుపాక్షిక యుద్ధ విన్యాసాల్లో భాగంగా లా పెరోస్ - 2023 మూడో ఎడిషన్ సోమవారం ప్రారంభమైంది. ఈ విన్యాసాలు మంగళవారమూ కొనసాగనున్నాయి. వీటిని హిందూ మహా సముద్ర ప్రాంతంలో నిర్వహిస్తున్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో పాల్గొనే నౌకాదళాల మధ్య సముద్ర డొమైన్ అవగాహనను మెరుగుపరచడంతో పాటు సముద్ర సమన్వయాన్ని ఆప్టిమైజ్ చేయడమే లక్ష్యంగా ఈ విన్యాసాలు సాగనున్నాయి. రాయల్ ఆస్ట్రేలియన్ నేవీ, ఫ్రెంచ్ నేవీ, ఇండియన్ నేవీ, జపనీస్ సిబ్బంది, మారిటైమ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్, రాయల్ నేవీ, యునైటెడ్ స్టేట్స్ నేవీ నౌకలు, హెలీకాప్టర్లు ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి. సముద్ర కార్యకలాపాల నూతన ప్రణాళిక, సమన్వయం, సమాచార భాగస్వామ్యం ప్రధాన అంశాలుగా ఈ విన్యాసాలు సాగనున్నాయి. భారత నావికా దళం నుంచి స్వదేశీయంగా నిర్మించిన గైడెడ్ మిస్సైల్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ సహ్యాద్రి, ఫ్లీట్ ట్యాంకర్ ఐఎన్ఎస్ జ్యోతి ఈ ఎడిషన్‌లో పాల్గొంటున్నాయి.

పోర్టు ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ వెల్ఫేర్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ వెల్ఫేర్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. సంఘంలో ఇటీవల ఖాళీ అయిన పోస్టులను ఎన్నికల ప్రక్రియ ద్వారా భర్తీ చేశారు. అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు, ఎలక్షన్ కన్వీనర్ ఎంఎన్ఎస్ఎస్.సింగ్ ఆధ్వర్యంలో ఈ ఖాళీ పోస్టుల ఎన్నిక ప్రక్రియ జరిగింది. అందులో భాగంగా అసోసియేషన్ అధ్యక్షులుగా ఎం.దేవేశ్వరరావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ కార్యదర్శిగా జి.ఉమామహేశ్వరరావు యధావిధిగా కొనసాగనున్నారు. ఉపాధ్యక్షులుగా పి.ప్రసన్న కుమార్, దీప్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు ఎలక్షన్ కన్వీనర్ సింగ్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి అధికారుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేయాలన్నారు.

విశాఖ పోర్టును సందర్శించిన డిఫెన్స్ కాలేజీ బృందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 17 మంది సభ్యులతో కూడిన నేషనల్ డిఫెన్స్ కాలేజీ బృందం సోమవారం విశాఖపట్నం పోర్టును సందర్శించింది. వారికి పోర్టు చైర్మన్ కె.రామ్మోహన్‌రావు సాదర స్వాగతం పలికారు. పోర్టులోని మౌలిక వసతులు, ఎగుమతులు, దిగుమతులకు ఉన్న అవకాశాలను వారికి ఆయన వివరించారు. కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె, సెక్రటరీ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అందరి చూపూ రెండో ప్రాధాన్యత వైపే

- ఆ ఓటుతో గట్టెక్కేదెవరు ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండో ప్రాధాన్యత ఓటు ఎంతో కీలకం. ఈ ఓటే విజేతనూ నిర్ణయిస్తుంది. సోమవారం జరిగిన మండలి ఎన్నికల్లో వైసిపి, తెలుగుదేశం, బిజెపి, పిడిఎఫ్ అభ్యర్థుల చూపులు పోలింగ్ అనంతరం రెండో ఓటుపైనే పడ్డాయి. ముఖ్యంగా అధికార పార్టీ వైసిపి తొలి ప్రాధాన్యత ఓటుపైనే కేంద్రీకరించి ఆ పార్టీ శ్రేణులను సమాయత్తం చేసింది. మరోపక్క తెలుగుదేశం పార్టీకి మొదటి ఓటు వేసిన కొంతమంది, వైసిపిలోని కొంత మంది పిడిఎఫ్ గెలవాలని కోరుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దీంతో ఇరుపార్టీల నుంచీ రెండో ప్రాధాన్యత ఓటు పిడిఎఫ్‌కు లభించే అవకాశాలున్నాయని, ఈ నేపథ్యంలో డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు విజయావకాశాలు ఎక్కువుగా ఉన్నాయని అంతటా చర్చ నడుస్తోంది. 2024 సాధారణ ఎన్నికలకు ఈ మండలి ఎన్నికలు సెమీ ఫైనల్స్ అంటూ అధికార వైసిపి ప్రకటన చేసినా ఆ దిశగా పట్టభద్రులెవరు అడుగులేసిన దాఖలా కానరావడం లేదు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీని నిలువరించకపోతే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎదుర్కొనడం కష్టమనే భావన తెలుగుదేశం పార్టీ ఓటర్లు గుర్తించారన్నది తెలుస్తోంది. బిజెపికి మొదట ఓటు వేసిన వారిలో కొందరు టిడిపికి రెండో ప్రాధాన్యత ఇచ్చినట్లు వినికిడి.

ఓటేసిన ప్రముఖులు

ఓటు వేసిన కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

సోమవారం జరిగిన శాసనమండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విశాఖకు చెందిన పలువురు రాజకీయ నేతలు, అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ, 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని బూత్ నెంబర్ 245లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, విశాఖపట్నం ఎంపీ ఎంవివి.సత్యనారాయణ కృష్ణా కాలేజీలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ దండు బజార్ వద్ద ఉన్న ఎంవిడిఎం స్కూల్‌లో ఓటు వేశారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అక్కిరెడ్డిపాలెంలోని జెడ్‌పి హైస్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. బిజెపి అభ్యర్థి పివిఎన్.మాధవ్ ఆంధ్ర యూనివర్సిటీ హైస్కూల్లోని 248 పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. టిడిపి అభ్యర్థి వి.చిరంజీవిరావు ఆంధ్ర యూనివర్సిటీలోని రూమ్ నెంబర్ 123లో ఓటు వేశారు. వీరితోపాటు బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు, తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, గంటా శ్రీనివాసరావులు ఎంవిపి కాలనీ గిరిజన భవన్ వద్ద ఏర్పాటు చేసిన 225 పోలింగ్ కేంద్రంలో వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ పోలింగ్ బూత్ 244లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఓటు వేశారు. ఎయు హైస్కూల్‌లోగల 248 పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ ఓటు వినియోగించుకున్నారు. జిల్లా అధికారులు, పోలీసు యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో పోలింగ్ ప్రశాంతంగా సాగింది.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, AT VISAKHAPATNAM.
S.O.P., 47/2022

Smt. Kakada Smruthi W/o Srimanthula Naveen Kumar (late), converted Christian, Paged 24 years, residing at D.No. 24-38-7, MIG-1-103, Vinayaka Nagar, VUDA Colony, Pedagantyada, Gajuwaka, Viskahapatnam-530044, Aadhar No.2792 3972 7381, Cell No.7036073904.

AND:

1.Smt. Srimanthula Krishna Kumari W/o Srimanthula Venkata Apparao (late), converted Christian, aged 43 years, residing at D.No. 1-09A, Patipalli, Munagapaka Mandal, Visakhapatnam District, -531033,, Aadhar No.2740 7126 4995, CellNo.9642277642.

2.The Chief General Manager, NAVAL ARMAMENT DEPOT, VA/1802/174, Visakhapatnam-530009

జనరల్ నోటీస్

ఇందుమూలముగా పై పిటీషనర్‌కు భర్తయును ఒకటవ రెస్పాండెంట్‌ను కుమారుడయును, రెండవ రెస్పాండెంట్ అధారిటీకి ఉద్యోగియును అయినటువంటి శ్రీ శ్రీమంతుల నవీన్‌కుమార్,త ండ్రి శ్రీమంతుల వెంకట అప్పారావు (లేట్) రెండవ రెస్పాండెంట్ వద్ద ఉద్యోగం చేస్తూ కాలం చేసియున్నారు. మరణించిన శ్రీమంతుల నవీన్‌కుమార్‌కు సంబంధించిన డెత్ బెనిఫిట్సు వగైరాల నిమిత్తం ఆయన భార్య అయిన పై పిటీషనర్, 2వ రెస్పాండెంట్ అధారిటీని కోరగా, వారు వారసత్వపు సర్టిఫికేట్ అడిగినారు. కావున పై పిటీషనర్ ప్రిన్సిపల్ సీనియర్ సివిల జడ్జి వారి కోర్టులో ఎస్.ఒ.పి.నెం. 47/2022 అను పిటిషన్ వారసత్వపు సర్టిఫికేట్ (Succession Certificate) కొరకు దాఖలు చేసియున్నారు. పైన తెలిపిన ఎస్.ఒ.పి.నెం. 47/2022 పై కోర్టులో వున్నందున తేది:31-03-2023 ఉదయం 10-30 గం॥లకు అభ్యంతరములు ఉన్నవారు ఎవరైనాను స్వయముగా గాని, మీ తరపున న్యాయవాది ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలను తెలియచేసుకొనవలెను. లేనియెడల ఆక్షేపణలు ఏమి లేవని నిర్ధారించుకొని పై ఎస్.ఒ.పి.నెం. 47/2022 పరోక్షముగా తీర్మానించి శ్రీ కోర్టు వారు తదుపరి చర్య తీసుకొందురు.

B.K.SATYANARAYANA
D.DANTESWARA RAO
Advocates, Gopalapatnam,
Visakahpatnam-29.
Cell : 9440826282

IN THE HON'BLE COURT OF X ADDL. DISTRICT JUDGE, AT: ANAKAPALLI
I.A.198/2021 in O.S.49/2017

Between:
Padala Srinivasa Reddy ...Petitioner/Plaintiff

And:
Kundrapu Leela @ Leelavati ...Respondent/Defendant

NOTICE

To,
Respondent/Defendant:
Kundrapu Leela @ Leelavati,
W/o. Muthyalayya,R/at D.No.52-34/B, Lakshmi Devi Peta, Anakapalli, Visakhapatnam District

Whereas, the petitioner/plaintiff hereinabove filed the aforesaid application in the said suit against you seeking final decree in terms of preliminary decree and for other reliefs. Whereas it is found to the satisfaction of the Hon'ble Court that you i.e., the respondent/defendant have been evading receipt of notices in the above I.A.198/2021, consistently. The above mentioned respondent/defendant is therefore hereby directed to appear before the Hon'ble X Addl. District Judge Court, Anakapalli either in person or through an Advocate or duly Authorized agent, in support of your defence to show cause on **13-04-2023** at **10.30 A.M** as to why reliefs prayed for should not be granted. Take notice that in case of default to appear before the Hon'ble X Addl. District Judge Court, Anakapalli, the application, I.A.198/2021 will be heard and determined in your absence.

(By the Order of the Hon'ble Court)
V.SATISH, Advocate
Visakhapatnam, **Cell: 98485 18385**

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM
E.P.No. 26 / 2020 in Dispute No. 423 / 2015

Between:
M/s. Margadarsi Chit Fund Private Limited. Seethammapeta Branch Visakhapatnam . . . Decree Holder

And:
Mr. K.Bhaskara Rao and 5 others . . . Judgment Debtors

PROCLAMATION OF SALE

Notice is hereby given that by an order of the Court named above, the property of 5th Jdr (i.e. **Pentapalli Dhana Lakshmi, W/o. Chandra Sekhar**) mentioned in the schedule hereunder has been ordered to be sold by public auction in satisfaction of the claim of the decree holder mentioned in the above E.P. for sum of Rs. 10,63,379/- (excluding publication charges and battas) up to the date of sale in the aforesaid dispute against the judgement debtor mentioned above.

Public are hereby informed that the sale will be by public auction and the same will be held between **10-30 A.M. to 05-00 PM on 29-03-2023** at public court i.e., PRINICIPAL JUNIOR CIVIL JUDGE'S COURT, BHEEMUNIPATNAM.

At the sale the public are generally invited to bid, either personally or by duly authorised agent subject to terms and conditions to sale which may be had from the counsel for the decree holder whose address particulars are furnished hereunder.

SCHEDULE OF PROPERTY

The Immovable Property of Jdr 5: Visakhapatnam District, Madhurawada Sub Registry, Patta No. 585, Covered by Survey No. 4/3, built in 1418 Sft. (Including Common area) and 80 Sft. Car Parking vide Document No. 6385/2015, Flat No. 402, 3rd Floor in J.J. Mansion Apartment, Madhurawada Village, Visakhapatnam within the limits of Greater Visakhapatnam Municipal Corporation and bounded as follows :

East : Open to Sky **West** : Common Corridore
South : Open to SKY **North** : Common Corridore

DHR's Value : **Rs. 30,00,000/-**
F.A's Value : **Rs. 50,00,000/-**
JDR's Value : Not known as the Jdr did not furnish the same.

P.MURALI GOPAL
Advocate, Visakhapatnam - 530016.
Cell : 98483 20248

Visakhapatnam
Dt. 13-03-2023

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM
E.P.No. 6/2022 in Dispute No. 109 / 2019

Between:
M/s. Margadarsi Chit Fund Private Limited. Seethammapeta Branch Visakhapatnam . . . Decree Holder

And:
Mr. Shaik Fyzulla Baig and 3 others . . . Judgment Debtors

PROCLAMATION OF SALE

Notice is hereby given that by an order of the Court named above, the property of 3rd Jdr (i.e. **Najana Sriramulu, S/o. Suryanarayana**) mentioned in the schedule hereunder has been ordered to be sold by public auction in satisfaction of the claim of the decree holder mentioned in the above E.P. for sum of Rs. 5,73,395/- (excluding publication charges and battas) up to the date of sale in the aforesaid dispute against the judgement debtor mentioned above.

Public are hereby informed that the sale will be by public auction and the same will be held between **10-30 A.M. to 05-00 PM on 29-03-2023** at public court i.e., PRINICIPAL JUNIOR CIVIL JUDGE'S COURT, BHEEMUNIPATNAM.

At the sale the public are generally invited to bid, either personally or by duly authorised agent subject to terms and conditions to sale which may be had from the counsel for the decree holder whose address particulars are furnished hereunder.

SCHEDULE OF PROPERTY

The Immovable Property of Jdr 3: Visakhapatnam District, Madhurawada Sub Registry, RCC Slabbed house bearing D.No. 17-41, Plot No. LIG 1-38, with an extent of 66.66 Sq. Yards or 55.74 Sq. Mtrs. with an plinth area of 266.10 sft. in Survey No. 57/3 situated at APHB Layout, Pothinamallayyapalem Village, with in the limits of Greater Visakhapatnam Municipal Corporation and bounded as follows :

East : 20 feet Wide Road **West** : Plot No. LIG-55
North : Plot No. LIG - 37 **South** : Plot No. LIG-39

DHR's Value : **Rs. 6,00,000/-**
F.A's Value : **Rs. 26,00,000/-**
JDR's Value : Not known as the Jdr did not furnish the same.

P.MURALI GOPAL
Advocate, Visakhapatnam - 530016.
Cell : 98483 20248

Visakhapatnam
Dt. 13-03-2023

కాపులుప్పాడలో జివిఎంసి కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి -మధురవాడ : కాపులుప్పాడ డంపింగ్ యార్డ్, జిందాల్ విద్యుత్ ప్లాంట్, ముడసర్లోవ, మర్రిపాలెం తదితర ప్రాంతాలలో జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు సోమవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, జి -20 సదస్సుకు 40 దేశాల నుంచి 80 మంది ప్రతినిధులు విచ్చేయుచున్నారని తెలిపారు. ప్రతినిధులు నగరంలో పలు ప్రాజెక్టులు వీక్షిస్తారని, అందుకు ఆయా ప్రాంతాలను శుభ్రంగా ఉంచేందుకు అధికారులను ఆదేశించమని తెలిపారు. కాపులప్పాడ డంపింగ్ యార్డ్, జిందాల్ విద్యుత్ ప్లాంట్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలని అధికారులను ఆదేశించారు. జిందాల్ విద్యుత్ ప్లాంట్ వద్ద టాయిలెట్లు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాలని, పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలని, ప్లాస్టిక్ ఎక్కడ కనిపించకూడదని, పాడైన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు ఏర్పాటు చేయాలని, ప్రతిరోజు మొక్కలకు నీరు పోయాలని ఆదేశించారు. ముడసర్లోవ సోలార్ ప్లాంట్ పరిసరాలు పచ్చదనంగా ఉండేటట్లు చూడాలని, రోడ్డు సెంటర్ డివైడర్‌లో బోగన్ విల్లా ప్లాంటేషన్ వేసి పరిరక్షించాలన్నారు. అనంతరం మర్రిపాలెం తాగునీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. స్తంభాలకు కేబుల్ వైర్లు వేలాడకుండా చూడాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, జోనల్ కమిషనర్లు కనకమహాలక్ష్మి, ఆర్‌జివి.కృష్ణ, డిడి హెచ్.దామోదరావు, పర్యవేక్షక ఇంజనీర్లు పాల్గొన్నారు.

కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రాజాబాబు

'ఐస్క్వేర్ ఆర్-2023'లో పాల్గొన్న ఐఇటిఇ విద్యార్థులు

16 నుంచి గీతంలో ఐఇటిఇ సాంకేతిక ఉత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి అనుబంధంగా గల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఇటిఇ) ఆధ్వర్యాన జాతీయ స్థాయి సాంకేతిక యువజనోత్సవం "ఐస్క్వేర్ ఆర్-2023" నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ప్రొఫెసర్ జెబి.సెవెన్త్‌లైన్ తెలిపారు. విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులతో పాటు వర్క్‌షాపు, సాంకేతిక ప్రసంగాలు 16, 17 తేదీలలో నిర్వహిస్తామని చెప్పారు. ఈ సాంకేతిక ఉత్సవం నేపథ్యంలో రహదారి భద్రతపై వాక్‌థాన్, ఫ్లాష్ మాబ్‌లను నిర్వహించామని పేర్కొన్నారు. దాదాపు 200 మంది విద్యార్థులతో జరిగిన ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ సలహాదారులు డాక్టర్ ఎస్.నీరజ, డాక్టర్ పి.రాజు, కెవి.సత్యకుమార్, సిఎస్ఇ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.శిరీష పాల్గొన్నారు.

16న ఐటిఐలో స్కిల్ కనెక్ట్ డ్రైవ్

ప్రజాశక్తి -కంచరపాలెం : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన కంచరపాలెంలోని ప్రభుత్వ ఐటిఐలో పిఎంకెవివై 4.0లో భాగంగా 18-45 సంవత్సరాల మధ్య వయసు వారికి శిక్షణ, ఉద్యోగం ఇచ్చే కార్యక్రమంలో ఈ నెల 16వ తేదీన స్కిల్ కనెక్ట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని ఆంధ్ర ప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. పదవ తరగతి, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన వారికి స్కిల్ పెంపొందించేలా శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ మేళాకు హాజరయ్యేవారు అర్హత సర్టిఫికెట్లతో 16వ తేదీ ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9908799126 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో 40 సంవత్సరాలు పైబడిన రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి స్కానింగ్ చేసి మందులు అందించారు. ఈ నెల 18వ తేదీ వరకు ఈ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

నాటునాటుకు ఆస్కార్‌పై వేడుకలు

ప్రజాశక్తి -ఆనందపురం : తెలుగు పాట నాటు నాటుకు ఆస్కార్ అవార్డు వచ్చిన శుభ సందర్భంగా టీమ్ తారక్ ట్రస్ట్ ఆధ్వర్యాన జూనియర్ ఎన్‌టిఆర్ అభిమానులు వేడుకలు నిర్వహించారు. నీళ్లకుండీలు జంక్షన్ వద్ద కేక్ కట్ చేసి, జూనియర్ ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సంద్భంగా టీమ్ తారక్ ట్రస్ట్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు లెంక సురేష్ మాట్లాడుతూ, ప్రపంచం గర్వించదగ్గ ఉత్తమ అవార్డు మన దేశంలోనే మొదటిసారి తెలుగు చిత్రానికి రావటం పట్ల సంతోషంగా ఉందన్నారు. ఈ సినిమా లో పనిచేసిన రాజమౌళి అండ్ టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగిశెట్టి పృథ్వీరాజ్, బూర్లు శ్రీను, పక్కుర్తి అప్పలనాయుడు, లెంక అప్పారావు, ఉమ్మిడి సురేష్, నాగిశెట్టి రమేశ్, నాగిశెట్టి నర్సింగరావు, కోరుకుండ రమేష్, చిన్ని నాగేష్, బొద్దపు సురేష్, నాగిశెట్టి శ్రీను, యమారాణి సురేష్, బూర్లు రవి, పి.సాయి, బూర్లు అప్పలనర్సయ్య, కారుమూరి సురేష్, తోనంగి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారంలో అధికారులకు కార్యశాల

సెమినార్‌ను ప్రారంభిస్తున్న జైళ్ల శాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ, మినిస్టరీ ఆఫ్ హోమ్ ఆఫైర్స్ సంయుక్త ఆధ్వర్యాన విశాఖ కేంద్రకారాగారంలో 'స్టేక్ హోల్డర్స్ కో-ఆర్డినేషన్ అండర్ లీడర్‌షిప్' అంశంపై జైళ్ల శాఖ అధికారులకు కార్యశాల నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యశాలకు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మేఘాలయ, హిమాచల్‌ప్రదేశ్ నుంచి వివిధ హోదాల్లో ఉన్న 21 మంది అధికారులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ జైళ్లశాఖ ఐజి డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అధికారులకు శిక్షణ అనేది అన్ని శాఖలలో ఒక భాగం అని, దీని ద్వారా కొత్త విషయాలను తెలుసుకొనుటకు దోహద పడుతుందని తెలిపారు. మొదటి రోజైన సోమవారం క్రిమినల్ జస్టిస్ సిస్టమ్, టీం బిల్డింగ్ స్కిల్స్ వంటి అంశాలపై అసోసియేట్ డీన్ నందిని, వి.సతీష్ చర్చించారు. ఈ కార్యక్రమంలో విశాఖ కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్, డిఎస్‌పి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గీతం అధ్యాపకులకు నిరంతర శిక్షణ

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నూతనంగా బోధన వృత్తిని స్వీకరించిన అధ్యాపకులకు నిరంతర శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు గీతం అకడమిక్ ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం నూతన అధ్యాపకులకు ఈ నెల 17వ తేదీ వరకు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. నూతన విద్యా విధానంలో చోటు చేసుకున్న మార్పులు, ఐటి రంగంతో ముడిపడిన బోధన విధానాలు అధ్యాపకులు అర్థంచేసుకుని కాలానుగుణంగా బోధనలో ఉన్నత ప్రమాణాలు పాటించాలని సూచించారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మాట్లాడుతూ ఏటా 300 మంది అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రపంచ శ్రేణి విశ్వవిద్యాలయంగా గీతంను తీర్చిదిద్దడానికి ఈ తరహా శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్.శర్మ మాట్లాడుతూ బోధన, పరిశోధనలలో అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమాలు రూపొందించామని తెలిపారు. కార్యక్రమంలో గీతం క్యాంపస్ లైఫ్ ప్రొవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, గీతం హైదరాబాద్, బెంగళూరులకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

గీతం అధ్యాపకులకు శిక్షణ ఇస్తున్న ప్రతినిధులు

వన్డే మ్యాచ్‌కు ఏర్పాట్లు పరిశీలన

పిఎంపాలెం ఎసిఎ - విడిసిఎ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎసిఎ ప్రతినిధులు

ప్రజాశక్తి పిఎం పాలెం : పిఎంపాలెం ఎసిఎ - విడిసిఎ స్టేడియం వేదికగా ఈ నెల 19వ తేదీన జరిగే ఇండియా, ఆస్ట్రేలియా 2వ వన్డే మ్యాచ్ జరుగనున్న నేపథ్యంలో సోమవారం ఎసిఎ సెక్రటరీ ఎస్ఆర్. గోపీనాథ్‌రెడ్డి, కోశాధికారి ఎవి.చలం, కౌన్సిలర్ పురుషోత్తంరావు, సిఇఒ ఎంవి.శివారెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. గ్రౌండ్, ప్రేక్షకుల ప్రవేశ ద్వారాలు, గేట్ల వద్దకు వెళ్లే రోడ్లు, బారికేడ్‌ను పరిశీలించారు.

అవగాహన శిబిరంలో మాట్లాడుతున్న జిమ్సర్ ప్రతినిధి

గ్లకోమా అవగాహనా వారోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : నేత్ర సంబంధ గ్లకోమా వ్యాధిపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి పేర్కొన్నారు. జిమ్సర్ వైద్యాలయంలో గ్లకోమా అవగాహనా వారోత్సవాలను సోమవారం ఆమె ప్రారంభించారు. దేశంలో దాదాపు 12 మిలియన్ల జనాభా గ్లకోమాతో బాధ పడుతున్నారని, 50 శాతం కేసులలో బాధితులు ఏ చికిత్సకు నోచుకోకుండా ఉండిపోతున్నారని తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వారిలో గ్లకోమాను గుర్తించి సకాలంలో చికిత్స చేయకపోతే అంధత్వానికి దారితీస్తుందన్నారు. గ్లకోమా స్క్రీనింగ్‌తో పాటు చికిత్సకు అవసరమైన అధునాతన వైద్య సదుపాయాలు గీతం వైద్యాలయంలో ఉన్నాయని తెలిపారు. నగర ప్రజలు గీతంలోని నేత్రవిభాగాన్ని సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్లకోమా చికిత్సా నిపుణుడు డాక్టర్ కెవివి.సత్యనారాయణ, విభాగాధిపతి డాక్టర్ వివిఎల్.నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

టిటిడి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండలోని టిటిడి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం స్వరూపనందేంద్ర సరస్వతి, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఆలయాన్ని దర్శించుకున్నారు ఈ సందర్భంగా స్వరూపనందేంద్ర సరస్వతి స్వామి మాట్లాడుతూ, సముద్ర సాక్షిగా స్వామివారిని ఇక్కడ ప్రతిష్టించి సోమవారం నాటికి సంవత్సరం అయిందని తెలిపారు. సింహాచలం అప్పన్న ప్రతి రూపంగా ఇక్కడ స్వామి భక్తులకు దర్శనమిస్తున్నారని తెలిపారు.

టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు రానున్న రోజుల్లో జమ్మూ కాశ్మీర్, శ్రీకాకుళం జిల్లా సీతంపేట, అల్లూరి జిల్లా రంపచోడవరంలో వెంకటేశ్వర స్వామి ఆలయాలను నిర్మిస్తామని తెలిపారు.

సింహగిరి రైల్వే కాలనీలో డిఆర్ఎం తనిఖీ

ప్రజాశక్తి-విశాఖపట్నం : తాటిచెట్లపాలెంల సమీపంలోని సింహగిరి రైల్వే కాలనీని వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్ అనుప్‌కుమార్ సత్పతి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కాలనీలోని సౌకర్యాలను పరిశీలించేందుకు సీనియర్ డివిజనల్ ఇంజినీర్ ఎస్కె.సారంగి, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలోని ప్రాథమిక సౌకర్యాలు, పారిశుధ్యం, భద్రత, రైల్వే క్వార్టర్ల పరిస్థితిని మెరుగుపరిచేందుకు వీక్షించారు. కాలనీలోని ఉద్యోగుల కుటుంబాలతో మాట్లాడి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఇళ్లను పరిశీలించి పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం డిఆర్ఎం మాట్లాడుతూ, ఉద్యోగుల కుటుంబాల సంక్షేమం, ఇళ్ల స్థితిగతులను తెలుసుకోవడం, సౌకర్యాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకోవడమే తనిఖీల ఉద్దేశమన్నారు.

నగరంలోని జివిఎంసి పాఠశాలలో మండుటెండలో ఆరుబయటే ఓటు వేసేందుకు బారులుదీరిన పట్టభద్రుల ఓటర్లు

ఓటు కోసం క్యూలైన్‌లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ రమాప్రభ, డాక్టర్ బి.గంగారావు

ఓటు వేసేందుకు క్యూలైన్‌లో అనకాపల్లి కలెక్టర్ రవిసుభాష్

ఓటు వేసిన అనకాపల్లి ఎంపీ సత్యవతి

రాంబిల్లిలో ఓటింగ్ సరళి పరిశీలనలో కె.లోకనాథం, ఎస్.సుధాకర్ తదితరులు

గాజువాకలో పిడిఎఫ్ శిబిరంలో సిఐటియు నేత నర్సింగరావు

సజావుగా ఎమ్మెల్సీ పోలింగ్

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పలుచోట్ల సాయంత్రం 4 గంటల తర్వాత కూడా ఓటర్లు బారు తీరారు. వారికి అధికారులు టోకెన్లు ఇచ్చి ఓట్లు వేయించారు.

భీమునిపట్నం : భీమిలి, తగరపువలసలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకే కొన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ పూర్తవ్వగా, అత్యధిక ఓటర్లున్న భీమిలి లోని 295, 296 పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 4 గంటలకు కూడా ఓటర్లు బారులు తీరి ఉండడం కనిపించింది. సాయంత్రం 4 గంటల తర్వాత ఓటింగ్‌కు వచ్చేవారిని పోలీసులు నిలిపివేశారు. దీంతో కొందరు ఓటర్లు వెనుతిరిగి వెళ్ళారు. భీమునిపట్నం మండలంలోని 4 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం ఓట్లు 4,156 ఓటర్లు ఉండగా 2,858 ఓట్లు పోలయ్యాయి. మండలంలో 68.76 శాతం పోలింగ్ నమోదైంది.

బారులు తీరిన ఓటర్లు...

భీమిలిలోని శ్రీ నూకాలమ్మ గుడి ఎదురుగా ఉన్న జివిఎంసి ఎంఎఫ్‌సి యుపి పాఠశాలలో ఏర్పాటుచేసిన 295, 296 పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 9 గంటల నుంచే ఓటర్లు బారులు తీరి ఉన్నారు. ఓటింగ్ వేగం పెరగకున్నా, క్యూ లైన్ మాత్రం ప్రతి అరగంటకూ పెరుగుతూ ఉండడం కనిపించింది. 295 పోలింగ్ కేంద్రం వద్ద సాయంత్రం 4 గంటల సమయానికి ఎగువ పేట సామాజిక వేదిక వరకు క్యూ లైన్ ఉంది. 296 పోలింగ్ కేంద్రం వద్ద కూడా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకూ క్యూ లైన్ ఉంది.

295 పోలింగ్ కేంద్రానికి ఉదయం 10 గంటలకు ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు మధ్యాహ్నం 2.30 గంటల సమయానికి వేయగలిగామని కొందరు ఓటర్లు చెప్పారు. మధ్యాహ్నం 2 గంటలకు ఓటు వేసేందుకు వచ్చిన వారు సాయంత్రం 4 గంటల వరకు పొడవాటి క్యూ లైన్ లో ఉండడం కనిపించింది. 4 గంటలకు క్యూలైన్లో ఉన్న వారికి ఆయా పోలింగ్ కేంద్రాల అధికారులు ఓటు వేసేందుకు అనుమతి ఇస్తూ టోకెన్లు ఇచ్చారు.

భీమిలిలోని 295 పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు గంటల తరబడి మండే ఎండలో నిల్చున్నారు. పరిస్థితిని గమనించిన భీమిలి తహశీల్దార్ కోరాడ వేణు గోపాల్ మధ్యాహ్నం 2 గంటలకు టెంట్ వేయాలని సిబ్బందిని ఆదేశించారు. పలువురు పట్టభద్రులు, ఉపాధ్యాయినిలు చంటి పిల్లలతో పోలింగ్ కేంద్రాల వద్ద కనిపించారు. విశాఖ నగరంలోని మురళీ నగర్‌కు చెందిన కె.లలిత తన 6 నెలల బిడ్డతో ఓటేసేందుకు భీమిలిలోని 296 పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చారు.ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ కె.లక్ష్మణమూర్తి ఆధ్వర్యాన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పద్మనాభం : పద్మనాభం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 22 గ్రామపంచాయతీకు సంబంధించి 1067 ఓటర్లకు గానూ 780 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నాలుగు నెలల వయసు గల చంటి పిల్లాడితో ఒక మహిళ వచ్చి ఓటు వేశారు. సాయంత్రం 6.30 గంటల వరకు పోలింగ్ జరిగింది. 73.1 శాతం పోలింగ్ నమోదైనట్లు తహశీల్దార్ తెలిపారు.

పిఎం పాలెం : మధురవాడ చంద్రంపాలెం జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఆరు పోలింగ్ బూతుల ద్వారా ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 5904 ఓటర్లకు 3393 మంది ఓట్లు వేశారు. 58.03 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ ప్రక్రియను డీసీపీ-1 సునీల్ సుమిత్ గరుడ పర్యవేక్షించారు. పిడిఎఫ్ అభ్యర్థి కొరెడ్ల రమాప్రభ చంద్రంపాలెం పాఠశాలను సందర్శించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

గాజువాక : పెదగంట్యాడ పరిధిలోని ఓటర్లకు నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్, బాల చెరువు ఎంపిపి స్కూల్, దుర్గవానిపాలెం ఎంపిపి స్కూళ్లలో, గాజువాక ప్రాంతంలోని వారికి గాజువాక, అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూళ్లలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఓటింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగడంతో అన్ని కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. చాలామంది ఓటర్లు నిలబడలేక ఓటు వేయకుండానే వెనుతిరగడం కనిపించింది. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు సందర్శించారు. అక్కడి నుంచి అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ చేరుకొని ఓటింగ్ సరళి అడిగి తెలుసుకున్నారు.

అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఓటు వేశారు. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వేశారు.

గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రచారం నిర్వహిస్తున్నారని టిడిపి కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, వైసిపి నాయకులు పల్లా పెంటారావు మధ్య వివాదం తలెత్తింది. పోలీసులు ఇద్దరినీ పోలింగ్ స్టేషన్ నుంచి బయటికి పంపించేశారు. తమ అభ్యర్థులను వెళ్లనీయడం లేదని అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రోసిడింగ్ అధికారిపై మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తంచేశారు.

పెదగంట్యాడలో మొత్తం 3791 మంది ఓటర్లకుగానూ 2479 ఓటు హక్కును వినియోగించుకున్నారు. 64 శాతం ఓటింగ్ నమోదైంది. గాజువాక, అక్కిరెడ్డిపాలెం హైస్కూల్లో మొత్తం 8932 ఓటర్లకు 5289 మంది ఓటును వినియోగించుకున్నారు. 59.21 శాతం పోలింగ్ నమోదైంది.

ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రెండు పోలింగ్ కేంద్రాలలో 1600 మంది పట్టభద్రుల ఓటర్లకు గాను 1153 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 72.06 శాతం పోలింగ్ శాతం నమోదైంది. ఉదయం నుంచి మందకొడిగా సాగిన ఓటింగ్ మధ్యాహ్నం మూడు గంటల తర్వాత పోలింగ్ కేంద్రాల దగ్గర ఓటర్లు బారులు తీరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక తహశీల్దార్ లోకవరపు రామారావు, సిఐ రామచంద్రరావు పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు

సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డులోని కేంద్రంలో ఓటు ఉందని చెప్పి స్లిప్పు ఇచ్చారని, ఇప్పుడు మరోచోట ఓటు ఉందని చెప్పడంపై కొందరు అసహనం వ్యక్తంచేశారు. ఈ పోలింగ్ కేంద్రాన్ని ఉత్తరాంధ్ర వైసిపి రీజినల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ మాధవ్, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సందర్శించారు.

ఆరిలోవ : ఆరిలోవ, తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాయంత్రం 6.30 వరకు ఓటింగ్ జరిగింది. సాయంత్రం 4 గంటల తరువాత లైన్‌లో ఉన్న సుమారు 800 మంది ఉండటంతో వారందరి చేతా ఓటు వేయించారు. విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఈ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కంచరపాలెం : జివిఎంసి 54వ వార్డు పరిధి జ్యోతీనగర్ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో సాయంత్రం ఏడు గంటల వరకు ఓటింగ్ సాగింది. వాసుపల్లి గణేష్ కుమార్ తన కుటుంబంతో కలిసి 270 బూతులో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పెందుర్తి : వేపగుంట, పురుషోత్తపురం, చినముషిడివాడ, పెందుర్తి ప్రభుత్వ పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. 15 పంచాయతీలు, మూడు వార్డులకు సంబంధించి ఈ నాలుగు కేంద్రాల్లో ఓటర్లకు పోలింగ్ ఏర్పాట్లుచేశారు. గ్రామాల నుంచి వచ్చేవారికి దూరాభారమైంది. మండుటెండలో నిలబడి ఓటు వేయాల్సి వచ్చింది. శాంతినగర్ పాఠశాల వద్ద యువతి సొమ్మసిల్లి పడిపోయింది. ఈ కేంద్రాలను పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ సందర్శించారు. ఓటర్ డొంకన్న దేవుడు ఓటు ఎవరో వేశారని చాలెంజ్ ఓటుకు వెళ్లారు. చాలామంది ఓట్లు గల్లంతయ్యాయని అసహనం వ్యక్తం చేశారు.

ములగాడ : శ్రీహరిపురం, పిలకవానిపాలెం బూత్ నెంబర్ 273, సింధియా గాంధీ గ్రామ్ బూత్ నెంబర్ 274, మల్కాపురం జివిఎంసి పాఠశాలలో బూత్ నెంబర్ 275లో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

దక్షిణంలో ప్రశాంతంగా పోలింగ్

బ్యాలెట్ బాక్స్‌లకు సీల్ వేస్తున్న పోలింగ్ అధికారులు

కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం దక్షిణ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. నియోజవర్గంలో 9546 మంది ఓటర్లు ఉండగా వారి కోసం 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ఉదయం 10 గంటల ప్రాంతంలో దండు బజారులోగల ఎంవిడి హై స్కూలు 251 పోలింగ్ బూత్‌కి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా పరిషత్ జంక్షన్‌లోని రామకృష్ణ మిషన్ హైస్కూలులోని 250 నెంబర్‌గల పోలింగ్ కేంద్రంలో టిడిపి విశాఖ పార్లమెంట్ కన్వీనర్, గీతం విద్యాసంస్థల చైర్మన్ ఎం.శ్రీ భరత్ ఓటు వేశారు.

డాబా గార్డెన్స్ ప్రేమ సమాజంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్ దంపతులు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ప్రేమ సమాజం పోలింగ్ కేంద్రం బయట వైసిపి తరపున ఏర్పాటుచేసిన టేబుల్స్ వద్ద కూర్చుని ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లను ప్రసన్నం చేసుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్దా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

ఎంవిపి.కాలనీ : ఎయులో తన ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో పర్యటించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేటట్లు చూడాలని బృందాలను, ప్రజా సంఘాలను ఆమె అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మధురవాడలోని చంద్రంపాలెం హైస్కూల్, వేపగుంట జెడ్‌పి హైస్కూల్, పెందుర్తి బాయ్స్ హైస్కూల్, గోపాలపట్నం జెడ్‌పి హైస్కూల్, మర్రిపాలెం జ్యోతి నగర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంతో పాటు కంచరపాలెంలోని రామ్మూర్తి పంతులు హైస్కూల్, ఎవిఎన్.కళాశాల, రామకృష్ణ హైస్కూల్, దండు బజార్‌లోని ఎంవిడిఎం హైస్కూల్‌తో పాటు మద్దిలపాలెంలోని కృష్ణ కళాశాల, ఎంవిపి కాలనీలోని గిరిజన్ భవన్, ఆల్వార్‌దాస్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ మందకొడిగా సాగుతూ ఉండటంతో, ఎక్కువ మంది రెండు నుంచి నాలుగు గంటల వరకు క్యూ లైన్‌లోనే నిల్చొని ఉన్నామని ఆమెకు తెలియజేయడంతో వెంటనే స్పందించిన ఆమె ఆ విషయాన్ని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పోలింగ్ త్వరగా జరిగేటట్టు చర్యలు చేపట్టాలని కోరారు.

పోలింగ్ సరళి పరిశీలనకు వచ్చిన వైవి.సుబ్బారెడ్డి, కెకె.రాజు

ఓటేసిన మాజీ ఎమ్మెల్సీ శర్మ దంపతులు

ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిలుచున్న మాజీ మంత్రి గంటా

దేవరాపల్లిలో ఓటింగ్ సరళి పరిశీలనలో ఉపముఖ్యమంత్రి బూడి

పోలింగ్ సరళి పరిశీలనకు వచ్చిన బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్

పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై పోలీసు ఉన్నతాధికారుల పరిశీలన

అచ్యుతాపురంలో ఆలస్యమైందని గేటు వేసి అనుమతించని పోలీసులు

అనకాపల్లిలో పిడిఎఫ్ శిబిరంలో ప్రజాసంఘాల నేతలు

గొలుగొండలో భద్రత పర్యవేక్షణలో అడిషనల్ ఎస్పి సత్యనారాయణ

నక్కపల్లిలో ఓటేసిన తెలుగు మహిళ అధ్యక్షురాలు అనిత

ఓటు వేసేందుకు వచ్చిన గర్భిణి, పసిపాపతో బాలింత, చిన్నారితో మహిళ

ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న వృద్ధులైన పట్టభద్రుల ఓటర్లు

ఓటు వేసేందుకు పాకుకుంటూ వచ్చిన వికలాంగ పట్టభద్రులు

పోలింగ్ కేంద్రాల వద్ద వికలాంగులు, వీల్‌చైర్‌లో వచ్చిన ఓటర్లకు పోలీసుల సహకారం

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

ప్రజాశక్తి -పరవాడ

రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగులో అనువదించిన తొలి తెలుగు కవయిత్రి అతుకూరి మొల్లమాంబ 583వ జయంతి కార్యక్రమం మండలంలోని గొర్లివానిపాలెం కాలనీలో సోమవారం గ్రామ కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గొర్లి గోపి అమ్ములు మాట్లాడుతూ సుమారుగా 600 సంవత్సరాల క్రితమే మొల్ల ఆనాటి అగ్రవర్ణాలను ఎదిరించి చదువుకొని, రామాయణాన్ని రచించిందని కొనియాడారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 583 సంవత్సరాల క్రితం ఒక మహిళ సాధించిందని, పోరాటాలతోనే ఏదైనా సాధించవచ్చనే ధైర్యంతో నాటి అగ్రవర్ణాల వారితో పోరాటాలు చేసి తన వ్యక్తిత్వంతో రామాయణ రచించిందని పేర్కొన్నారు. విశాఖ జిల్లా కుమ్మరశాలివాన సంఘం అధ్యక్షులు కొత్తూరు గెడ్డప్ప మాట్లాడుతూ కేవలం ఐదు రోజుల్లో స్వచ్ఛమైన తెలుగు భాషలో రామాయణాన్ని రచించిన మహా కవి అని తెలిపారు. సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మొల్ల జయంతి జిల్లాలోని ప్రతి గ్రామం లోనూ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ డి.అర్జున వెంకట రావు, ప్రధాన కార్యదర్శి ఎం.రామస్వామి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కాదులూరి కనకారావు, విశాఖ జిల్లా కార్యదర్శి కెటయు భాస్కర్, పరవాడ మండల అధ్యక్షులు అనకాపల్లి నాగేశ్వరరావు, అధిక సంఖ్యలో మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

మొల్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -కశింకోట

మండలంలోని తాళ్లపాలెం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మళ్ళ మాణిక్యం సోమవారం తెలిపారు. మార్చి 24వ తేదీలోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐదవ తరగతి ప్రవేశం కొరకు విద్యార్థులు 2021-22 విద్యా సంవత్సరంలో మూడవ తరగతి, 2022-23 విద్యా సంవత్సరంలో నాలుగవ తరగతి, ప్రభుత్వ పాఠశాలలో గాని లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏదేని ప్రేవేటు పాఠశాలల్లో నిరవధికంగా చదువు పూర్తి చేసి ఉండాలని, 2010 సెప్టెంబర్ 1 నుండి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారై ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల సంవత్సరం ఆదాయం ఒక లక్ష రూపాయలు మించరాదన్నారు. ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశానికి దరఖాస్తు చేసుకొను వారు 2022-23 విద్యా సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో 10వ తరగతి పూర్తి చేసిన వారై ఉండాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు http//:apgpcet.apcfss.in ద్వారా ఐదవ తరగతి, ఇంటర్కు నెట్ సెంటర్లోగాని, తాళ్లపాలెం గురుకుల పాఠశాలలోగాని, ఏదైనా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోగాని దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్థిని పాస్ ఫోటోతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 23న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించగా, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కొండ ప్రాంతంలో మంటలు

ప్రజాశక్తి- రాంబిల్లి

రాంబిల్లి మండలం గొరపూడి పంచాయతీ అప్పన్నపాలెం అటవీ ప్రాంతంలో ఉన్న కొండ అగ్ని ప్రమాదానికి గురైంది. మంటలు వ్యాపించి చెట్లు కాలిపోయాయి. మూడు రోజులుగా మంటలు వ్యాపించి ఆరకుండా ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో గొర్పుడు పంచాయితీ సర్పంచ్ పైడి రత్నం గణేష్ తన బాధ్యతగా తీసుకొని దగ్గరుండి ఫైర్ ఇంజన్ తీసుకొచ్చి మంటలను అదుపు చేయించి ఫారెస్ట్‌ను కాపాడడం జరిగింది.

ధారాలమ్మ జాతరకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -సీలేరు

మన్యం ప్రజలు ఆరాధ్య దైవంగా భావించే ధారాలమ్మ అమ్మవారి 59వ వార్షిక మహోత్సవాలు సోమవారం నుంచి కొత్త అమావాస్య వరకు వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సందర్భంగా ముహూర్తపు రాటను దేవాదాయ శాఖ అధికారి సాంబశివరావు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం వేశారు. ఈ క్రమంలో అమ్మవారి సన్నిధిలో గరగలు కార్యక్రమంలో ఈవో సాంబశివరావు పాల్గొని అమ్మవారికి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండోమెంట్ ఈవో సాంబశివరావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 18న అమ్మవారి సన్నిధిలో కలశ స్థాపన, 19 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. 21న సాయంత్రం అమ్మవారి ప్రధాన పూజ కార్యక్రమాలు అనంతరం ఆలయానికి తలుపులు మూసివేసి 22 ఉదయం 5:45 గంటలకు అమ్మవారి తలుపులు తెరవబడతాయని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డిపి టి ఈశ్వరరావు, జిల్లా సీపీ కార్యవర్గ సభ్యులు సుంకర విష్ణుమూర్తి పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి

మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి- కె.కోటపాడు

గ్రామాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సెక్రెటరీ ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేక అధికారి ఈ.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని ఎంపిడీవో కార్యాలయంలో సోమవారం డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయ కార్యదర్శులతో ఆమె సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 32 పంచాయతీలలో 12 గ్రామాలను అందంగా తయారు చేయుటకు ఎంపిక చేయడం జరిగిందని, వాటిని ఏప్రిల్ 30వ తేదీలోగా సుందర గ్రామాలుగా చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఉన్న డంపింగ్ యార్డులో చెత్త నుండి సంపద తయారు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో 2084 ఇళ్లు మంజూరు అయ్యాయని, వాటి నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే 1292 ఇంటి పనులు ప్రారంభమయ్యాయని, 209 ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయని మిగిలిన పనులు పూర్తి చేయుటకు సంబంధిత అధికారులు శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీవో కాండ్రేగుల శశిదేవి, ఇఒపిఆర్‌డి ప్రసాదు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

22న భావన రుషి, భద్రావతి కల్యాణం

ప్రజాశక్తి- మునగపాక రూరల్

మండలంలోని తోటాడ గ్రామంలో ఈనెల 22వ తేదీన భావన రుషి కాశీ విశ్వేశ్వర దేవస్థానంలో భావన రుషి, భద్రావతి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లుగా ఆలయ కమిటీ నిర్వాహకులు తెలియజేశారు. ఈ మేరకు పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం గోడపత్రికను ఆవిష్కరించారు. 22న సాయంత్రం ఏడు గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన మండపంపై ఉత్సవ విగ్రహాలను ఉంచి అర్చకులు కళ్యాణం జరిపిస్తారని, 23న ఉదయం స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు, జరిపిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించడం జరుగుతుందని తెలిపారు. అదే రోజు స్వామివారి పల్లకి ఊరేగింపు, సాయంత్రం తీర్థ మహోత్సవం, ఉయ్యాల సేవ వంటి కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దొడ్డి త్రినాథ్, సన్యాసిరావు, తాతబాబు, సత్యనారాయణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని భర్నికం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారిని ఎం.సునీత సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం, రికార్డులు, విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం వంట రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలను ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచాలని, టాయిలెట్స్ విషయంలో కూడా పరిశుభ్రత పాటించాలని సూచించారు. పాఠశాలకు సంబంధించిన వివిధ రికార్డులను ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలన్నారు. విద్యార్థులలో విద్యా ప్రమాణాల స్థాయిని మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులందరూ కష్టపడి పని చేయాలని ప్రధానోపాధ్యాయురాలు బి.కవితకు సూచించారు.

రెండు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని అంతాడ పంచాయతీ పరిధి, కొత్తపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకు ఇళ్లు కాలిపోయినట్లు ఎఎంసి చైర్‌పర్సన్ జైతి రాజులమ్మ, సర్పంచి సుర్ల చంద్రరావు తెలిపారు. ప్రమాదవశాత్తు చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన రీమల శ్రీనివాస్, రాటా మంగకు చెందిన రెండు ఇళ్లు కాలి బూడిదయ్యాయని, ఇంటిలోని వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయని పేర్కొన్నారు.

బ్రాండిక్స్ ఆధ్వర్యాన 450 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి అచ్యుతాపురం

బ్రాండిక్స్ ఇండియా అపరల్ సిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 102వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 450 మంది కంటి రోగులను వైద్యులు పరీక్షించారు. కంటి వైద్య శిబిరానికి సాధారణ చికిత్సలతో పాటుగా, 310కి ఉచిత అద్దాలను అందించి, 97మందికి మందులు ఇవ్వడం జరిగింది. 33మందికి కేటరాక్ట్ సర్జరీ చేయించుకోవాల్సిందిగా వైద్యులు సూచించారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరం శంకర్ ఫౌండేషన్ వారితో కలిసి నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వచ్చినవారికి మజ్జిక, ఫలహారాలు, భోజనం సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ ఇండియా పార్టనర్ దొరస్వామి మాట్లాడుతూ బ్రాండిక్స్ ఇండియా ముఖ్యమైన సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్రాండిక్స్ సిబ్బంది, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

కళ్ల అద్దాలు పంపిణీ చేస్తున్న బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి

మళ్లీ తెరపైకి రోడ్డు విస్తరణ

-100 అడుగుల వెడల్పుకు ప్రతిపాదనలు -ఆందోళనలో వ్యాపారులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:నర్సీపట్నంలో రద్దీ పెరగడంతో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావడంతో గత ప్రభుత్వ హయాంలో రోడ్డు 120అడుగులు వెడల్పు చేయాలని అప్పట్లోనే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అనుకోకుండా ఊహించని పరిణామాలతో అప్పట్లో రోడ్డు అభివృద్ధికి అయ్యన్న వెనకడుగు వేయడంతో వెడల్పు ప్రక్రియ ఆగి పోయింది. ఇటీవల ఆ ప్రతిపాదన స్థానిక శాసనసభ్యులు మళ్లీ తెరపైకి తీసుకు వచ్చారు. ఉమా శంకర్ గణేష్ రోడ్డు అభివృద్ధికి ముఖ్యమంత్రితో మాట్లాడి సుమారు 11 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయించారు.దీంతో అధికార యంత్రాంగం భవిష్యత్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే సూచనతో వంద అడుగులు వెడల్పు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి చక చకా పనులు ప్రారంభించి డిజిటల్ సర్వే చేసి రోడ్డు మార్కింగ్‌ను పూర్తి చేశారు.

ఇదిలా ఉండగా 100 అడుగులు వెడల్పు చేస్తే తామంతా నష్టపోతామని బిల్డింగ్ యజమానులు వాపోయారు. ఈ నేపథ్యంలో నర్సీపట్నం వాణిజ్య సముదాయాల యజమానులు సంఘటిత మయ్యారు. దీనిపై ఆదివారం ఒక సమావేశాన్ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. మెయిన్ రోడ్ అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. నర్సీపట్నం మెయిన్ రోడ్ వెడల్పు చేస్తే తాము తీవ్రంగా నష్టపోతామని వంద అడుగులు వెడల్పు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని తమకి ఆమోదయోగ్యంగా ఉండేవిధంగా ఎనభై అడుగులు వెడల్పు చేసే అంశాన్ని పునరాలోచన చేయాలని కోరారు. ఈనెల పద్నాలుగున పట్నంలో వ్యాపార సంస్థలు బంద్ పాటించాలని తీర్మానం చేశారు.అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే ఉమాశంకర గణేష్, మున్సిపల్, రెవెన్యూశాఖ అధికారులకు వినతిపత్రం ఇవ్వాలని భవన యజమానులు నిర్ణయం తీసుకున్నారు.

నర్సీపట్నంలో ప్రధాన రహదారి

ఇదిలా ఉండగా మరోపక్క నానాటికి పెరిగి పోతున్న ట్రాఫిక్ సమస్య నేపథ్యంలో అధికారులు నిర్ణయించినట్టుగానే వంద అడుగులు వెడల్పు చేయడం అవసరమని, భవిష్యత్తు తరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు, మేధావులు, పట్టణవాసులు, తదితరులు అభిప్రాయ పడుతున్నారు.

నీరజకు ఫిర్యాదు చేస్తున్న అప్పలరాజు

వెండి నాణేల పంపిణీపై ఫిర్యాదు

ప్రజాశక్తి-నక్కపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని హెటిరో యాజమాన్యం కంపెనీలో పని చేస్తున్న ఓటు హక్కు కలిగిన ఉద్యోగులకు, కంపెనీ చుట్టూ గల గ్రామాల్లో ఓటు హక్కు కలిగిన ఓటర్లకు వెండి నాణేలు పంపిణీ చేశారని ఆరోపిస్తూ కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేసారు. సోమవారం ఇన్చార్జ్ తహశీల్దార్ నీరజ, ఎస్ఐ శిరీషకు హెటెరో యాజమాన్యంపై ఫిర్యాదు చేశారు. ఈనెల 12,13 తేదీల్లో ఓటర్లకు వెండి నాణేలు పంపిణీ చేశారన్నారు.పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించడానికి వచ్చిన డి.ఎస్.పి ప్రవీణ్ కుమార్, సిఐ అప్పలరాజు దృష్టికు ఫిర్యాదు చేసారు. ఇందుకు కారణమైన వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతమ్మ రాజు సుధాకర్ పై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు మహేష్, రాము, పిక్కి రాజు, లోవరాజు తదితర్లు పాల్గొన్నారు.

19న ఉచిత సంతాన వైద్య శిబిరం

శ్రీ లలిత మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ స్త్రీ వైద్య నిపుణులు శ్రీదేవి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం శ్రీలలిత మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ సౌజన్యంతో లండన్ ఐవిఎఫ్ సెంటర్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఈ నెల 19న శ్రీలలిత మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ వద్ద ఉచిత సంతాన సాఫల్య శిబిరం నిర్వహిస్తున్నామని ఆసుపత్రి ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు ఎ.శ్రీదేవి తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ శిబిరంలో ఉచితంగా కన్సల్టేషన్, స్కానింగ్, కౌన్సిలింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ శిబిరానికి ఇన్ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ చంద్రారెడ్డి సమక్షంలో ఈ శిబిరం నిర్వహిస్తామన్నారు. రిజిస్ట్రేషన్, ఎన్రోల్మెంట్‌కు 8978425444, 8978545444, 9618551521 ఫోన్ చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఒడిమెట్ట - గొడిచెర్ల జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు ఎస్సై శిరీష తెలిపారు.విశాఖ వైపు వెళుతున్న కారు ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. 108 వాహనంలో తుని ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స అందించి ,మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు .ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.మృతి చెందిన మహిళ ఆచూకీ తెలిసినట్లయితే పోలీస్ స్టేషన్ సంప్రదించాలన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

ఎన్నికల ఏర్పాట్లపై అయ్యన్న అసహనం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నేపథ్యంలో నర్సీపట్నంలో ఏర్పాటు చేసిన ఏర్పాట్లపై మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. ఎన్నికల నిర్వహణపై అవగాహన లేక పోవడంతోనే ఈ సమస్యలు ఎదురయ్యాయని ధ్వజమెత్తారు.ఎన్నికల నిర్వహణపై అనుభవం లేనివారికి బాధ్యతలు అప్పగించడంతో ఓటర్లు చాలా ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. ఒక్కొక్క బూత్‌లో వెయ్యి ఓట్లు వేయడానికి గంటల సమయం పట్టిందని, దీనిపై ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎన్నికలు అడ్డగోలుగా నిర్వహించారన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ పరిశీలించారు.స్థానిక హుకుంపేట పంచాయతీ కార్యదర్శి త్రినాథ్ పోలింగ్ కేంద్రంలో పరిశుభ్రత చేయక పోవడంతో పాటు ఎన్నికల విధుల నిర్వహణలో గైర్హాజరయ్యారని ఫోన్ చేసినా సమాధానం ఇవ్వలేదని ఎండిఓ వెంకట్రావు, తహశీల్దార్ రాజలక్ష్మి కలెక్టర్ సుమిత్ కుమార్ కు ఫిర్యాదు చేశారు.

నర్సీపట్నంలో ఉద్రిక్తత

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఎమ్మెల్సీ ఓటు వేసి బయటకు వచ్చిన ఎమ్మెల్యే గణేష్ తన కారు ఎక్కుతున్న సమయంలో దూరంగా ఉన్న వ్యతిరేక వర్గం వ్యక్తులు కేకలు వేశారు. దీంతో ఎమ్మెల్యే కారు దిగి తన కార్యకర్తలతో కలిసి నేరుగా వ్యతిరేక వర్గం ఉన్న ప్రదేశానికి వెళ్లారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సిన వచ్చింది.

ఎమ్మెల్యే గణేష్, టిడిపి నేతల మధ్య వాగ్వాదం

డీవార్మింగ్ డేను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పాడేరు:జిల్లా కేంద్రంలోని చింతలవీధి, గుడివాడ, కుమ్మరిపుట్‌లోని గురుకుల బాలికల పాఠశాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి భాషా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 14న జరిగే నేషనల్ డి వార్మింగ్ డే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు ఏ విధంగా ఉపయోగించాలో? ఏ వయసు వారికి ఏ విధంగా ఇవ్వాలనేదానిపై అవగాహన కల్పించారు. అంగన్వాడి సెంటర్లలో బరువు తక్కువ ఉన్న పిల్లల ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వీలైతే జిల్లా ఆస్పత్రిలో చేర్పించాలన్నారు. పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందేలా చూడాలని ఆయన సూచించారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులకు 7 గ్రామ్స్ కంటే బ్లడ్ తక్కువ ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి పౌష్టికారం అందే విధంగా చూడాలని చెప్పారు. ఆల్బెండజోల్ మాత్రలు వేసుకున్న పిల్లలను అరగంట వరకు అబ్జర్వేషన్‌లో ఉంచాలని, ఎటువంటి దుష్

పరిశీలిస్తున్న డిఎం హెచ్ఓ

పరిణామాలు జరిగినా వెంటనే స్థానికంగా ఉన్న ఆరోగ్య సిబ్బందికి తెలియ చేయాలన్నారు. పిల్లలు వేడి నీరు తాగాలన్నారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఆరోగ్య సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయనతోపాటు హెల్త్ అసిస్టెంట్ శెట్టి నాగరాజు పాల్గొన్నారు.

29 నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

ప్రజాశక్తి-పాడేరు: సుండ్రుపుట్టు రామాలయంలో ఈనెల 29, 30, 31 తేదీలలో శ్రీరామ నవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం ఉదయం రామాలయం వద్ద ముహూర్తపు రాట (పందిరి రాట)ను వేశారు. భక్తులు, మహిళలు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు డిపి సురేష్, జవ్వాది బాబురావు, సిహెచ్ గోపాల్, బి.బాలయ్య, డిపి సంతోష్, శేషు, జె.భాను ప్రసాద్, శ్రీహరి, టైసన్, భాస్కర్, వెంకట్, శ్రీరాములు, కోటి పాల్గొన్నారు.

ఉపాధ్యాయునిపై ఫిర్యాదు

ప్రజాశక్తి అనంతగిరి: మండలంలోని సోమవారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్‌లో వైసిపి పార్టీకి చెందిన ఉపాధ్యాయుడు ఎన్నికల ఏజెంట్‌గా వెళ్లినందుకు సిపిఎం జెడ్పిటిసి దీసరి. గంగరాజు ఆధ్వర్యాన జాయింట్ కలెక్టర్, తహశీల్దార్‌లకు లిఖిత పూర్వకంగా, ఫోన్‌లో ఫిర్యాదులు చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో జెడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ, వైసిపికి చెందిన ఎగుబూడి ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు గబ్బయి. త్రినాథ్ ఎన్నికల ఏజెంట్‌గా వివరిస్తూ దొంగ ఓట్లను వేయించడం తగదన్నారు. ఉపాధ్యాయుడిని ఉద్యోగ బాధ్యత నుండి పూర్తిగా తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో టోకూరు సర్పంచ్ కె. మొష్య, గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎస్.నాగులు, కార్యకర్తలు జె.రామన్న పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తున్న నేతలు

ఓపిగ్గా ఓటేసిన పట్టభద్రులు

-గంటల తరబడి క్యూలైన్లలో ఓటర్లు - ప్రశాంతంగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు

యలమంచిలిలో బారులు తీరిన ఓటర్లు

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ కేంద్రాల వల్ల 144 సెక్షన్ అమలు చేశారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు పూర్తి కావాల్సి ఉండగా జిల్లాలోని అనేక కేంద్రాల్లో సాయంత్రం 6, 7 గంటల వరకు ఓటింగ్ కొనసాగింది. ప్రధానంగా 37 మంది అభ్యర్థుల ఫొటోలతో కూడిన బ్యాలెట్ పెద్దదిగా ఉండడంతో ఎన్నికల సిబ్బంది దానిని మడత పెట్టడం, ఓటర్లకు ఇవ్వడానికి, ఓటర్లు అభ్యర్థులను పరిశీలించి ఓటు వేయడానికి ఎక్కవ సమయం తీసుకుంది. దీంతో ఓటర్లు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్లు దాటిన తరువాత ప్రధాన పోటీలో ఉన్న పిడిఎఫ్, వైసిపి, టిడిపి, బిజెపి అభ్యర్థులకు సంబంధించిన శిబిరాలు ఏర్పాటు చేశారు. వాటి వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తమ అభ్యర్థులకు ఓటు వేయాల్సిందిగా ఓటర్లను అభ్యర్థిస్తూ సందడి చేశారు.

అనకాపల్లి :అనకాపల్లి పట్టణంలోని గాంధీనగరం, ఉడ్ పేట, జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాల, గవరపాలెం ఉన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహించగా, 191లో 1132 మంది, 192లో 860, 193లో 938, 194లో 1393, 195లో 1000, 195ఎ లో 653 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 11 గంటల తర్వాత ఓటర్లు పెద్ద ఎత్తున క్యూలైన్లో నిల్చున్నారు. అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి సత్యవతి, జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి జీవీఎంసీ ప్రధాన హైస్కూల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలో ఆరు పోలింగ్ కేంద్రాల వద్ద జరిగిన పోలింగ్ సరళిని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి పరిశీలించారు. వైసిపి శిబిరాల వద్ద మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ సత్యవతి, ఆ పార్టీ నాయకులు, టిడిపి శిబిరాల వద్ద మాజీ ఎమ్మెల్యే పీల గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, పిడిఎఫ్ శిబిరాల వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్ శంకర్రావు, జి.కోటేశ్వరరావు, సిపిఐ నాయకులు వైఎన్ భద్రం, కోన లక్ష్మణ తదితరులు సందడిగా కనిపించారు.

రాంబిల్లి : మండలంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో మొత్తం 834 ఓట్లుగానూ 693 పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాన్ని పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ ఎన్నికల ఏజెంట్ ఎస్.సుధాకర్ పరిశీలించారు. పిడిఎఫ్ శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం సందర్శించి కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

అచ్యుతాపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 1496 ఓట్లు ఉండగా, 1217 ఓట్లు పోలయ్యాయి. 81 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓట్లు వేయడానికి బాలింతలు సైతం క్యూలో గంటలు తరబడి నిరీక్షించవలసి వచ్చింది. పోలింగ్ కేంద్రాలను గేట్లు మూసిన తర్వాత తహశీల్దారు శ్రీనివాసరావు, ఎంపీడీవో విజయలక్ష్మి వచ్చి పోలింగ్ జరిగే తీరును పరిశీలించారు.

కె.కోటపాడు : కె.కోటపాడు జిల్లా పరిషత్తు ఉన్న పాఠశాలలో ఏర్పాటు చేసిన 171, 172 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1676 ఓట్లు ఉండగా, 1293 ఓట్లు పోలయ్యాయి. 77 శాతం పోలింగ్ శాతం నమోదైంది. ఉదయం 10గంటల తరువాత సాయంత్రం వరకు ఓటర్లు పెద్ద సంఖ్యలో బారులుతీరారు. పోలింగ్ కేంద్రం ప్రాంగణాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సందర్శించారు.

చోడవరం : చోడవరంలో పోలింగ్ మందకుడిగా సాగింది. 169, 170 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2722 ఓట్లుగాను, 1777 మంది తమ ఓటు హక్కును వినియోగించుకునారు. 65 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం ఓటర్లకు రెండు పోలింగ్ బూతులు మాత్రమే ఏర్పాటు చేయడంతో పెద్ద సంఖ్యలో ఓటర్లు క్యూలైన్లలో నిలబడాల్సి వచ్చింది. చాలా మంది నిలబడ లేక ఓటు వేయకుండానే వెనుదిరిగారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు చెందిన 13 ఓట్లు గల్లంతయ్యాయి. దీంతో ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఆయన లోపలికి వెళ్లకుండానే వినుదిరిగారు.

పరవాడ : పరవాడలో ఉదయం 8 గంటలకు మందకొడిగా పోలింగ్ ప్రారంభం కాగా, 10 గంటల తరువాత పెద్ద సంఖ్యలో ఓటర్లు రావడంతో గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. మొత్తం 70.83 శాతం పోలింగ్ జరిగింది. పోలింగ్ కేంద్రంలో తాగునీరు ఏర్పాటు చేయలేదని ఏజెంట్లు తెలిపారు.

దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4.30 గంటలకు ముగిసింది. మొత్తం 1518 ఓట్లు గాను 1174 ఓట్లు పోలయ్యాయి. మండలం మొత్తం 77.33 శాతం ఓట్లు పోలైనట్టు అధికారులు తెలిపారు. తహశీల్దారు ఎం.లక్ష్మి, ఎంపీడీఓ సిహెచ్ సుబ్బలక్ష్మి పర్యవేక్షించారు.

బుచ్చయ్యపేట : స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రక్రియ చాలా నెమ్మదిగా కొనసాగడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మధ్యాహ్నం సమయంలో తీవ్ర ఎండలో సైతం 200 మందికి పైగా ఓటర్లు క్యూలైన్లో వేచి ఉన్నారు. పోలింగ్ సమయం ముగిసిన సమయం 4 గంటలకు 300కు పైగా ఓటర్లు క్యూలైన్లో ఉన్నారు. వారందరూ ఓట్లు వేసే సరికి రాత్రి 8 గంటలైంది.

కశింకోట : మండలంలో మొత్తం 1458 ఓట్లు ఉండగా, 1172 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు 80.03 శాతంగా పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారి యడ్ల హరి తెలిపారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ పూర్తయింది. ఓటర్లలో పురుషులు 735 మంది, మహిళలు 437 మంది ఓటు వేశారు.

మునగపాక రూరల్ : మునగపాకలో సాయంత్రం 7 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఒకటే పోలింగ్ బూత్ ఏర్పాటు చేయడంతో పోలింగ్ మందకొడిగా జరిగింది. ఓటర్లు పెద్ద సంఖ్యలో క్యూలైన్లలో నిలబడ్డారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నపిల్లల తల్లులు నానా ఇక్కట్లు పడ్డారు. కొంతమంది ఓటర్లు క్యూలైన్ల నుండి విసుగుతో వెనుదిరిగారు. మండల వ్యాప్తంగా 1,239 ఓటర్లు ఉండగా 926 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సబ్బవరం : మండలంలోని 1899 ఓట్లు ఉండగా 1304 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1139 పురుషుల ఓట్లకు గాను 788 మంది, 759 స్త్రీల ఓట్లకు గాను 516 మంది ఓటు వేశారు. 68.66 శాతం పోలింగ్ జరిగింది. సాయంత్రం 4 గంటలకు లైనులో ఉన్న 378 మందికి టోకెన్‌లు ఇచ్చి రాత్రి 7.25 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు.

యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ, రూరల్ పరిధిలో మొత్తం ఓట్లు 2,354 ఉండగా 3 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 182 పోలింగ్ కేంద్రంలో 797, 182ఎ పోలింగ్ కేంద్రంలో 671, 183 పోలింగ్ కేంద్రంలో 459 మంది వెరసి 1,933 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 81.86 శాతం పోలింగ్ నమోదైంది. వైసీపీ మద్దతుదార్లు వెయ్యి రూపాయలు నగదు, గోల్డు కాయిన్స్ పంచినట్లు, తెలుగు దేశం వారు కొంత నగదు పంచినట్లు ప్రచారం జరిగింది.

అనకాపల్లి : ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలకు ఎన్నికల అధికారి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు పాసులు మంజూరు చేశారు. అయితే పోలీసులు వీరిని పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించలేదు. దీంతో తమకు పాసులు ఇచ్చి ప్రయోజనం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. అయితే తమకు వచ్చిన ఆదేశాల మేరకు అనుమతించలేదని తెలిపారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సాయంత్రం 4 గంటలకు పోలింగ్ అధికారి వచ్చి గేట్లకు తాళం వేయించారు. గేటు వేస్తుండగానే పోలింగ్ కేంద్రానికి ఒక మహిళా ఓటరు రాగా, ఆమెను లోపలకు అనుమతించలేదు. ఈ సమయంలో ఇంకా ఐదు నిమిషాలు ఉందని, ముందుగా గేట్లు వేశారని టిడిపికి చెందిన రాజాన నానాజీ, కూనిశెట్టి రమణ తదితరులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. పోలింగ్ అధికారి ఆదేశాలను తాము పాటించామని సిఐ వై.మురళి రావు వారికి చెప్పి అక్కడి నుండి పంపించి వేశారు.

నర్సీపట్నం డివిజన్‌లో ప్రశాంతం

కోటవురట్లలో బారులు తీరిన ఓటర్లు

ప్రజాశక్తి- నక్కపల్లి:ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల్లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసారు. 853 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. రెండు పోలింగ్ బూత్ లకు సంబంధించి మొత్తం 1118 ఓట్లు ఉండగా , 198 మంది స్త్రీలు, 655 మంది పురుషులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 78 శాతం పోలింగ్ నమోదయినట్లు అధికారులు వెల్లడించారు. ఇన్ ఛార్జ్ తహశిల్దార్ నీరజ, ఎంపిడిఒ సీతారామరాజు, డి.ఎస్.పి ప్రవీణ్ కుమార్, సిఐ అప్పలరాజు పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఎస్ఐ శిరీష బందోబస్తు ఏర్పాటు చేశారు. సెల్ ఫోన్‌ల కోసం బయట ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేసారు. వైధ్యాధికారి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిభిరం ఏర్పాటుచేసారు. మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబురావు వైసిపి శిబిరం వద్దకు వచ్చారు. వేంపాడు గ్రామానికి చెందిన దంపతులు, రాజయ్యపేటకు చెందిన వికలాంగుడు గోసల కాశీరావు ఓటు హక్కు వినియోగించుకున్నాడు.

ఇబ్బందులు పడ్డ ఓటర్లు

పోలింగ్ కేంద్రం వద్ద టెంట్ ఏర్పాటు చేయకపోవడం తో ఎండలో నిలబడిన ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓటు వేయడానికి రెండేసి గంటలు క్యూ లైన్ లో ఓటర్లు నిరీక్షించవల్సి వచ్చింది. ఎండ తీవ్రత గా ఉండడంతో స్కూల్ కాంపౌండ్‌లో ఓటర్లు కిక్కిరిసి పోయారు. డి.ఎస్.పి ప్రవీణ్ కుమార్, సిఐ అప్పలరాజు నీడలో నిలబడేవిధంగా చర్యలు తీసుకున్నారు.

పిఓ పై వైసిపి నేతం వీసం ఆగ్రహం

185 పోలింగ్ కేంద్రం పిఓ ప్రసాద్ పై రాష్ట్ర కాపు కార్పోరేషన్ డైరెక్టర్, వైసిపి నేత వీసం రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేసారు. మొదటి ప్రాధాన్యత ఓటు ఒక్కటే సరిపోదని, రెండో ప్రాధాన్యత ఓటు కూడా వేస్తేనే ఓటు చెల్లుబాటు అవుతుందని పిఓ ప్రసాద్ క్యూలో ఉన్న ఓటర్లకు చెబుతున్నారని ఆరోపిస్తూ పోలింగ్ కేంద్రం వద్ద పిఓ ను నిలదీసారు. దీంతో పిఓ వెంటనే పోలింగ్ కేంద్రంలోకి వెళ్లిపోయారు. నిబంధనలు ఉల్లంఘించి వ్యవహరిస్తే ఊరుకోబోమని వీసం హెచ్చరించారు. ఎస్ఐ శిరీష వచ్చి సర్దిచెప్పడంతో వీసం అక్కడ నుంచి వెనుదిరిగారు.

కోటవురట్ల: ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు బారులు తీరారు. పది గంటల నుంచి పోలింగ్ ఊపందుకుంది. ఒక్క పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు ఏర్పాటు చేయక పోవడంతో కొంతమంది అసహనం వ్యక్తం చేశారు.వైసిపి టిడిపి నాయకులు శిబిరాల వద్ద ఓటర్లకు భోజన ఏర్పాట్లు చేయడం విశేషం.

మండలంలో 1092 మంది ఓటర్లకు గాను 818 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగిం చుకున్నారు.

కొత్తకోట:రావికమతంలో ఒక్కటే బూత్ కావడంతో ఓటర్లు పెద్ద ఎత్తున బారులు తీరారు. ఓటర్లు గంటల తరబడి ఎండలో ఉండలేక వెను తిరిగేందుకు సిద్ధ పడగా గమంచిన తహసీల్దార్ మహేశ్వరావు టెంట్ వేసి, రెండవ కౌంబర్ ఏర్పాటు చేశారు. రావికమతంలో 4 గంటల సమయానికి 597 ఓట్లు, పోలయ్యాయి. క్యూలైనులో ఉన్న మరో 352 మందికి స్లిప్పులు ఇచ్చారు.

చీడికాడ:స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మహిళలు చంటి పిల్లలను తీసుకొని వచ్చి ఓట్లు వేశారు.మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పివిజి కుమార్, మాజీ జెడ్పిటిసి సత్యవతి ఓటు హక్కులను వినియోగించుకున్నారు.

రావికమతం :మండలంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రం జడ్పీ ఉన్నత పాఠశాల లో ఎన్నికల బూత్ ఏర్పాటు చేశారు. మండలంలో 1200 ఓట్లు ఉండగా 850 ఓట్లు పోలయ్యాయి. ఒక్కటే బూత్ కావడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు.

పాయకరావుపేట:స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తును సర్కిల్ ఇన్స్పెక్టర్ పాలిన అప్పలరాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి జిల్లా వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిక్కాల రామారావు, పబ్లిక్ వింగ్ జిల్లా అధ్యక్షులు దగ్గుపల్లి సాయి బాబా ఓటు హక్కును వినియోగించుకున్నారు.వీరితోపాటు చిక్కాల కుటుంబ సభ్యులు పాటు పబ్లిక్ వింగ్ అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా వినియోగించుకున్నారు

గొలుగొండ:మండల కేంద్రంలోని ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 1044 ఓటర్లు ఉండగా సాయంత్రం 5 గంటల సమయానికి 446 ఓట్లు పోలయ్యాయి. గంటల తరబడి ఓటర్లు ఎండలో క్యూలో నిల్చుకోవడానికి అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. టెంట్లు సరిపడా లేక ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత మరికొన్ని టెంట్లను

నర్సీపట్నంలో పసిపాపతో వచ్చిన ఓటర్లు

అధికారులు ఏర్పాటు చేయించారు. మంచినీటి సౌకర్యం లేకపోవడంతో ఓటర్లు తాగునీటి కోసం ఇబ్బంది పడ్డారు. గొలుగొండ పోలింగ్ కేంద్రాన్ని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, నర్సపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ సందర్శించారు. వారి వారి నాయకులతో మాట్లాడి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వి.జయరాం, జిల్లా అడిషనల్ ఎస్పీ సత్యనారాయణరావు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. సాయంత్రం వైసిపి నాయకులు ఓటరును లోపలికి పంపించేందుకు ప్రయత్నిస్తుంటే టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్ది సేపు ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది.

నర్సీపట్నం టౌన్ :ప్రభుత్వ మెయిన్ పాఠశాలలో నాలుగు బూత్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఓటింగ్ మందకొండి గానే కొనసాగింది. పోలింగ్ సిబ్బందికి సరైన అవగాహన లేకపోవడంతో మందకొండిగా కొనసాగింది.మధ్యాహ్నం ఒంటిగంటకు 1200 ఓట్లు పోలయ్యాయి. ఓటు వేసేందుకు వచ్చిన బాలింతలు చిన్నపిల్లలతో ఇబ్బందులు పడ్డారు.

రోలుగుంట:మండల కేంద్రంలోని ఎంపిపి పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం ఓట్లు 1038 కాగా 813 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అదికారి ధనలక్ష్మీ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రోలుగుంట ఎస్సై నాగకార్తీక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.